1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 10, 2024 | www.navatelangana.com

12న సీఎం కప్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

నవతెలంగాణ - కాసిపేట

ఈ నెల 12న కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సీఎం కప్ మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, పోటీల నిర్వాహక ఇన్‌చార్జిలు ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం మామిడిపల్లి సాంబమూర్తి తెలిపారు. సీఎం కప్ మండల స్థాయి ఎంపిక పోటీల్లో ఆరు రకాల క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలు ఉంటాయన్నారు. సీఎం కప్‌లో పాల్గొనే ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు డిసెంబర్ 12న ఉదయం 8:30గంటల లోపు కాసిపేట పాఠశాల క్రీడా మైదానంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నేరడిగొండ

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. ఈ జట్టులో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని పాఠశాల ప్రత్యేక అధికారి రజిత అభినందించారు.



ఇసుక రవాణా అరికట్టాలి



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం వడూర్ గ్రామ పరిధిలోని పెన్‌గంగ నది నుండి అక్రమ ఇసుక తరలింపును అరికట్టాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పెన్‌గంగ నది నుండి రాత్రీ పగలు తేడా లేకుండా జేసిపిలతో ఇసుక తోడుతూ వందల సంఖ్యలో ప్రతిరోజు ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నారని తెలిపారు. లోడ్ వాహనాలు వెళ్లడంతో గ్రామాల్లో సిసి రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయి పశువులకు నీళ్ల లేకుండా పోతున్నాయని తెలిపారు. తహసీల్దార్‌కు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వెంటనే ఇసుక రవాణాను అరికట్టి, తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తోడేటి భోజన్న, గ్రామస్తులు సుదర్శన్, రమణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, సురేందర్, మల్లేష్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శివకుమార్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన శివకుమార్‌ను భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దయాకర్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే శివకుమార్ అధికారుల సంఘానికి అధ్యక్షుడుగా కావటం సంతోషకరమన్నారు. జిల్లా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ అధికారుల సమస్యలతో పాటు రైతాంగ సమస్యల పరిష్కారానికి తన వంతు తోడ్పాటును అందిస్తానని తెలిపారు. రైతు నాయకులు ఎప్పుడైన తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగోరావు, పీఏసీఎస్ డైరెక్టర్ చంద్రకుమార్, భారతీయ కిసాన్ మోర్చా సెక్రటరీ శంకర్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో బీఎల్ఎఫ్ రాష్ట్ర మహాసభలు



నవతెలంగాణ-నేరడిగొండ

బీఎల్ఎఫ్(బహుజన లెఫ్ట్ పార్టీ) రాష్ట్ర మహాసభలు ఈ నెల 14,15 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శ చాట్ల పోసవ్వ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజన శ్రామిక ప్రజలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా పంపిణీ చేయాలనే శాస్త్రీయ ఆలోచనతో పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జాదవ్ శాంతి, శోభ, కె.భూపతి పాల్గొన్నారు.

ఇండ్ల పట్టాలు ఇవ్వాలని ప్రజావాణిలో వినతి

నవతెలంగాణ-మందమర్రి



సారంగపల్లి గ్రామ ప్రభుత్వ భూమిలో ఉన్న ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్ మాట్లాడుతూ సారంగపల్లి గ్రామ శివారులోని 322, 323 సర్వే నెంబర్ ఎస్సీ కాలనీలో మాదిగ కులానికి చెందిన 50కుటుంబాలు 45 సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకొని నివాసముంటున్నారన్నారు. ఇండ్లకు సంబంధించి ఎలాంటి ఆధారం లేదన్నారు. సర్వే నిర్వహించి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ- ఖానాపూర్

పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు డబ్బా శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తే అధికారులకు ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. గ్రామ మండల స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వరరావుతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసుల చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

- జైనూర్ బాధితులపై కేసులు ఉపసంహరించాలి
- చట్ట బద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ఏజన్సీ ప్రాంతంలోని చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాలు సంయుక్తంగా పేర్కొన్నాయి. సోమవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఉమ్మడి జిల్లాల ఆదివాసుల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఇటీవల కుమురంభీమ్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా జరిగిన సంఘటనల్లో ఆదివాసులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. 1950 తరువాత జైనూర్‌కు వలస వచ్చిన ముస్లింలను ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టాలన్నారు. ఏజన్సీలో చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల సమస్యలను పరిష్కరించాలని తొమ్మిది అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. సమస్యలను పరిష్కరించని యెడల ఏప్రిల్ నెలలో తిరిగి ఆదివాసుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సిడా భీంరావ్, గొడం గణేష్, పుర్క బాపురావ్, వెంకట్‌రావ్, జుగాదిరావ్‌తో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన ఆదివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకుడు



అమరులకు నివాళులర్పిస్తున్న ఆదివాసులు

16న ఐటీడీఏ ముట్టడి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కొలాంల అభివృద్ధికి వచ్చిన పీఎం జన్మన్ నిధులను ఐటీడీఏ అధికారులు పక్కదారి పట్టించారని కొలాం సేవా సంఘం అధ్యక్షుడు కొడప సోనేరావ్ అన్నారు. ఈ నెల 16న చేపట్టనున్న ఐటీడీఏ ముట్టడి కార్యక్రమంపై స్థానిక అంబేద్కర్ భవనంలో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముట్టడికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సోనేరావ్ మాట్లాడుతూ మన్నెవార్లు ఆదివాసీ ప్రాంతాల్లో కొలాంవార్లుగా చలామణి అవుతూ హక్కులను కొల్లగొడుతున్నారన్నారు. 16న ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి కొలాంలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్, కుమురం సూరు, యువజన సంఘం అధ్యక్షుడు కుమ్ర రాజు, టేకం ముక్త, మడావి జంగు, టేకం లక్ష్మణ్, కుమ్ర లక్ష్మీబాయి, టేకం గణేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి

నవతెలంగాణ - కాసిపేట



తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌కు వినతిపత్రం అందించారు. పనికి తగిన పారితోషికం మంజూరు, ప్రభుత్వ సెలవు రోజులలో సర్వే నిర్వహణకు మినహాయింపు ఇచ్చి కుటుంబంతో గడపడానికి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని, కాని గతంలో నిర్వహించిన శాసనసభ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు, మిషన్ భగీరథ నల్లా సర్వే, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ప్రజాపాలన దరఖాస్తుల నమోదు, కులగణన సర్వే, సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణ ఇలా ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కాని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సంబంధించిన శాఖల వారు పనిని తామే పూర్తి చేశామని ప్రభుత్వానికి తెలిపి, ప్రభుత్వ మన్ననలు పొందుతున్నారన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు చేసిన పనికి తగిన గుర్తింపు లభించక మానసికంగా కృంగిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్క సర్వే సిబ్బందికి 200 వరకు మాత్రమే దరఖాస్తులను నిర్దేశించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే సిబ్బందికి కూడా గతంలో కులగనణ సర్వే సిబ్బందికి మంజూరు చేసిన విధంగా తగిన పారితోషకం మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఆదివారం, ప్రభుత్వ సెలవు రోజుల నుండి మినహాయింపు ఇవ్వాలని, ఒకవేళ తప్పనిసరిగా సర్వే నిర్వహించాల్సి వస్తే ఇతర రోజులలో ఇట్టి సెలవులను వినియోగించుకునే విధంగా తగు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

16 నుండి సీఆర్టీల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిఆర్టిల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16 నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏసీఎంఓ ఉద్ధవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఆర్‌టిలకు వెంటనే ఎంటిఎస్ చేయాలన్నారు. పిఆర్సి అమలు చేయడంతో పాటు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల ఒకటో తారీఖున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ మొత్తాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంటిఎస్ అమలు చేయకుంటే ఈ నెల 16 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, శంకర్, నవనీత్, రమేష్, రవీందర్, జుగంధరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-జైపూర్

వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. శివ్వారం గ్రామానికి ఆవిడపు గణేష్‌తో పాటు కుందారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి సమ్మయ్యను సోమవారం తెల్లవారు జామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా చెన్నూర్ మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులను సైతం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెడింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి సంఘం పిలుపు నిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ వెళ్లకుండా మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ ముందస్తుగా అరెస్ట్ చేశారు. వీరిలో అధికార పార్టీకి చెందిన సర్పంచులు సైతం ఉన్నారు.



కాసిపేట : మండలంలోని తాజా మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తాజా మాజీ సర్పంచుల బిల్లులను విడుదల చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టగా కార్యక్రమానికి వెళ్లకుండా మాజీ సర్పంచులు, ఉప సర్పంచులను ముందస్తు అరెస్టు చేశారు. తాజా మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతిని కాసిపేట పోలీస్‌స్టేషన్‌కు, తాజా మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి నాయక్, పెంద్రం హన్మంతులను దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడితే ప్రభుత్వం స్పందించకుండా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు.



ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం యువజన కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు గాదె అరుణ్, ఉపాధ్యక్షులు కామెర మనోహర్, చెన్నూర్ నియోజకవర్గం యూత్ ఉపాధ్యక్షులు జలంపల్లి సృజన్, బత్తుల సాయి ప్రేమ్ యాదవ్, జైపూర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కాసిపేట సతీష్ పాల్గొన్నారు.

ఇచ్చోడ : సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఏఐసిసి సభ్యులు, పార్లమెంట్ కో-ఆర్డినేటర్ నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఏండ్ల కల నెరవేర్చిన సోనియా గాంధీ 78వ జన్మదినాన్ని కార్యకర్తలతో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మల్లేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్ ఖాన్, నాగ్‌నాథ్ అప్ప పాల్గొన్నారు.

మందమర్రి : సోనియా గాంధీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బి1 వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నోముల ఉపేందర్, పీసీసీ సభ్యులు గుడ్ల రమేష్, సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అమరవీరుల త్యాగాలు వృథా కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర రాజు, ఎండీ పాషా, తిరుపతి యాదవ్, నెరువట్ల శ్రీనివాస్, శామ్యూల్, అర్జున్, సాగర్, సారంగపాణి పాల్గొన్నారు.

కాసిపేట : కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర కల ఎన్నో ఏండ్ల పోరాటం, త్యాగాలతో సాధ్యమైందన్నారు. మాటకు కట్టుబడి సోనియా గాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని పొన్న గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ అని,రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోందని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ చైర్మన్ రంజాన్, నాయకులు రఘురాం, పాండు, రషీద్, ఇమామ్, సంజీవ్, మాధవ్ పటేల్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



ఇచ్చోడ :



మందమర్రి :



సిరికొండ :

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | డిసెంబర్ 10, 2024 | www.navatelangana.com

జన్మదినం వేళ పేదలకు అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తిరుమల చారిటేబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండ అనిల్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని రైల్వేస్టేషన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో ట్రస్ట్ సభ్యులు బండ అనిల్ కుమార్, కుర్ర రవి, మాదస్తు శంకర్, మల్లికార్జున్, శివమణి, సుమంత్, రవి పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని బామ్ని(కె) గ్రామంలో శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్ వాటర్ భూములను ఆక్రమించి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ అర్క మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సారెస్పీ కింద ముంపునకు గురైన భూములను కొందరు వ్యక్తులు కబ్జా చేసి, పంటలు పండిస్తున్నారన్నారు. దీంతో పశువుల మేతకు స్థలం లేక పశువులు అమ్ముకుంటున్నామని పశుపోషకులు పేర్కొంటున్నారు. కబ్జాదారుల నుంచి శ్రీరామ్ సాగర్ ముంపు భూములను రక్షించి, మూగజీవాలను రక్షించాలని తెలిపారు.



ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పాటిల్ కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, సమైక్యవాదుల నుంచి ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడ్డ గొప్ప నాయకురాలు సోనియమ్మ అని అన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, దర్శనాల లక్ష్మణ్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, దొగ్గలి రాజేశ్వర్, లత, ప్రభావతి, శ్రీలేఖ పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి దివంగత రాంచందర్ రెడ్డి నివాసంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, కౌన్సిలర్ అంబకంటి అశోక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తామే తెలంగాణ తెచ్చామని బీఆర్ఎస్ చెప్పుకోవడం సిగ్గుచేటని, విద్యార్థుల ఆత్మబలిదానాలకు చలించి పార్టీ భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ ఇచ్చిన దేవత సోనియమ్మ అని కొనియాడారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను కేట్ కట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హది మాట్లాడుతూ తెలంగాణ ప్రజల స్వరాష్ట్రం 60 ఏండ్ల ఆకాంక్షను నెరవేర్చిన త్యాగశీలి తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారెడ్డి, అడెల్లి ఆలయ మాజీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు విలాస్, నాయకులు పవర్ రాజేష్, సత్యపాల్‌రెడ్డి, రాజ్ కుమార్, పోతన్న, హైమద్, లక్ష్మణ్, సురేందర్, రాజేశ్వర్, డైరెక్టర్లు భోజన్న, పోతారెడ్డి, నాగోరావు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : తెలంగాణ ప్రధాత సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షులు జల్కే పాండురంగ్ మాట్లాడారు. 2014లో తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలని ఇచ్చిన తల్లి మన సోనియమ్మ అని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్ల శివుడు, దేవన్న, పొరెడ్డి నారాయణ, చట్ల నగేష్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించబడిన తీగుట్ల రాజకుమార్‌కి శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా హస్నాపూర్ గ్రామంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండలాధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం, కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, ఉట్నూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ లాజర్, మైనార్టీ జిల్లా నాయకులు నీసార్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, రాధాబాయి, ఖానాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరమేశ్వర్, గిరిజన నాయకులు భీమన్న, రాజేష్ జాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్ కుమార్, ఎస్సీ సెల్ నాయకులు భారత్, మండల ఎస్సీ సెల్ నాయకులు నందం, మండల ఎస్సీ సెల్, మైనారిటీ టౌన్ అధ్యక్షులు ఇమ్రాన్, నాయకులు కొల్లూరి స్వామి, భాస్కర్, ఉమేష్, గంగాధర్, రవి, అశోక్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఘనత సోనియా గాంధీ కే దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోనియా గాంధీ తెలంగాణ ప్రధాతా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్



అర్జుమంద్ అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీంరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఎంబడి రాజేశ్వర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సమరసింహా రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రాకేష్, పార్టీ మండలాధ్యక్షులు కుంట వేణుగోపాల్, ఆయన్నగారి పోశెట్టి, అజహర్, మతీన్, నర్సారెడ్డి, గాజుల రవికుమార్, పెండెం శ్రీనివాస్, పూదరి అరవింద్, రాజేందర్, మోయిన్, సింధియా సోమేష్, సభకలీం, రఫీ, కలీం, సాయి పాల్గొన్నారు.

నార్నూర్ : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. అనంతరం సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను సాకారం చేసిన రాష్ట్ర ప్రదాత, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తల్లి సోనియా గాంధీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు దేవరావ్ లోఖండే, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ షేక్ దాదే అలీ, జేపీసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తం, జాకురుల్ల ఖాన్, షేక్ దస్తగీర్, కరీం ఖాన్, షేక్ సత్తార్, యువ నాయకులు కోర్రల మహేందర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు నసీర్, గోవింద్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : మావల మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి తన నివాసంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, భారీ కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా స్వరాష్ట్రాన్ని ప్రకటించిన అమ్మ సోనియమ్మకు సదా తెలంగాణ సమాజం రుణపడి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటర్‌రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ మహ్మద్ ఇర్ఫాన్, దామోదర్ రెడ్డి, గోవర్ధన్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, సురేష్, రాజేందర్, గౌతమ్, కౌన్సిలర్ ముబారక్ పాల్గొన్నారు.





నాలుగో రోజుకు చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో సోనియామ్మకు జన్మదినం సమగ్ర శిక్షాకి శిక్ష దినం అనే వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోనియాగాంధీ చిత్రపటానికి పూలను అలంకరిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని అన్నారు. అదేవిధంగా తక్షణమే పేస్కేల్స్ అమలు చేయాలని అన్నారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, మంత్రులు, తమ గ్యారంటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కేశవ్ ప్రకాష్, దేవదర్శన్, వినోద్, సారథి, వెంకటి, శ్రీకాంత్, సురేందర్, రాజన్న, భోజన్న, సురేష్, దశరథ్, సంజీవ్, మమతా, హిమబిందు, జ్యోతి, సందీప్‌రెడ్డి, సలీం, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో సుష్మ స్వరాజ్ పాత్ర కీలకం

నవతెలంగాణ-భైంసా



నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష తెలంగాణ రాష్ట్ర సాధనలో అప్పటి బీజేపీ ప్రతిపక్ష నాయకురాలు సుష్మా స్వరాజ్ పాత్ర అమోఘమని, స్వర్గీయ చిన్నమ్మని విస్మరించడం ఏంటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రశ్నించారు. అసెంబ్లీలో పది సంవత్సరాలకు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసినందుకు ఆయన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేవలం కాంగ్రెస్ వల్లే తెలంగాణ రాలేదని, ఎందరో అమరుల త్యాగమని ఆరోజు ప్రతిపక్ష నాయకురాలు తీర్మానానికి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వ తప్పిదాల వల్లే తెలంగాణ ప్రగతి ఆగిపోయిందని, మళ్లీ అలాంటి తప్పిదాలు చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ విస్మరిస్తూ మాజీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం సరికాదని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు, మంత్రులకు సూచించారు. ప్రజా తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, మాజీ ఎమ్మెల్యేలకు నిధులు ఇస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ తల్లి రూపకర్తకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అన్నమొల్ల కిరణ్ కోరారు. ఇందులో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఈనెల 12న అంగన్‌వాడీ ఉద్యోగులకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం డీడబ్ల్యూఓ సబితకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సునీత, ముక్త, సుజాత, కళ్యాణి, పార్వతి ఉన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరిపి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా అధికారుల కండ్లు గప్పి రెండు ట్రాక్టర్‌లు తరలించుకొని వెళ్లిపోయారు. ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణ శివారు ప్రాంతాల నుంచి మొరాన్ని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం మధ్యాహ్నం సమయంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. కాగా పట్టుకున్న ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని సంబంధిత అధికారులు డ్రైవర్లకు ఆదేశించారు. దీంతో రెండు ట్రాక్టర్లను వాటి యజమానులు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురాగా మరో రెండు ట్రాక్టర్లకు సంబంధించిన డ్రైవర్లు అధికారుల కండ్లు కప్పి ఆ ట్రాక్టర్లను తరలించుకొని తీసుకెళ్లారు. తప్పించుకుపోయిన ట్రాక్టర్ల వివరాలను తెలుసుకొని వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు.

క్రీడా స్థలాన్ని పరిశీలించిన డీఎల్పీఓ



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

రేపటి నుంచి నిర్వహించే సీఎం కప్ పోటీల దృష్ట్యా దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం గ్రామంలోని క్రీడా స్థలాన్ని సోమవారం డీఎల్పీఓ రమేష్, ఎంపీఓ గోవర్ధన్ పరిశీలించారు. క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

తాజా మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల్లోని తాజా మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరుతూ నేడు సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

సైబర్ క్రైమ్ బారిన పడితే డయల్ 1930 : ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సైబర్ క్రైమ్ బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు కార్యాలయంలో నూతన సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో ప్రారంభించారు. ముందుగా ఎస్పీకి ఆదిలాబాద్ సైబర్ డీఎస్పీ హసీబుల్ల పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కార్యాలయాన్ని అత్యధిక సదుపాయాలతో, నూతన పరికరాలను అందజేసి, సైబర్ బాధితులకు వెంటనే న్యాయం చేకూరే విధంగా శిక్షణను తీసుకున్న నిష్ణాతులతో సిబ్బందితో కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత దేశంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను వినియోగించుకుంటూ ప్రజలను మోసం చేయడం జరుగుతుందని వాటి బారిన పడకుండా సైబర్ క్రైమ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్య పరుస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా టోల్ ఫ్రీ సైబర్ క్రైమ్ నెంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బు పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేసినట్లయితే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టే అవకాశం ఉన్నందున అతి త్వరగా స్పందించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో సైబర్ బారిన పడి నష్టపోయిన 90 మంది బాధితుల రూ. 17లక్షల 62వేల 381 తిరిగి వారికి న్యాయశాఖ సహకారంతో అందజేసినట్లు తెలిపారు. సైబర్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఫిర్యాదులనైనా తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా శిక్షణను తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వయోవృద్ధులు, ప్రజలు, విద్యార్థులు సైబర్ నేరగాళ్ల చే మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా ఫ్రాడ్స్, బ్యాంకు ఫ్రాడ్స్, అశ్లీల చిత్రాలను పోస్ట్ చేస్తామంటూ వివిధ రకాలైన పద్ధతులలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఉంటారని వారి చేతిలో మోసపోకుండా వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌ను గాని సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, హసీబుల్లా, పోలీసు కార్యాలయం ఏఓ భక్త ప్రహ్లాద్, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, ఇన్స్‌పెక్టర్లు డి.సాయినాథ్, కరుణాకర్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎస్ చంద్రశేఖర్ సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్‌లో డెయిరీ పార్లర్ ఏర్పాటు అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను అందించేలా రిమ్స్ ఆవరణలో పార్లర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో రిమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పర్యవేక్షకుడు డా.అశోక్ ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. మొదట ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాల ఉత్పత్తుల విక్రయాలను ప్రారంభించారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి రిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో నాణ్యమైన పాలను అందించే ఉద్దేశంతో పార్లర్‌ను ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. త్వరలో ఆర్టీసీ డిపోలోనే పార్లర్ ఏర్పాటు కానుందన్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల విద్యాలయాలకు విజయ డెయిరీ పాలను అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దూర ప్రాంతాల్లో ఉండే ఆశ్రమ పాఠశాలలకు సైతం విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేసేందుకు డీడీ కృషి చేస్తున్నారన్నారు. దీనివల్ల అటు రైతులకు ఆదాయం పెంచేందుకు వీలు కలగడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందించవచ్చన్నారు. డెయిరీ బలోపేతం కోసం ఇది దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మేనేజర్లు తుషార్, దస్రు నాయక్, పంపిణీదారు నరేందర్, సిబ్బంది ఊశన్న, సతీష్ పాల్గొన్నారు.



న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగులకు జీవిత బీమా, ఆరోగ్య బీమా, పదవీ విరమణ చేసే ఉద్యోగులకు రూ.25లక్షలు అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

బీసీ వసతి గృహాలలో చదువుకుని విద్యార్థులకు తక్షణమే దుప్పట్లు పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులకు గురవుతున్నారని విద్యార్థులకు చలి నుంచి రక్షణ పొందేందుకు దుప్పట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | డిసెంబర్ 10, 2024 | www.navatelangana.com

మేకల మందతో వచ్చిన చుక్కల దుప్పి

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని మురికిలొంక గ్రామ సమీపంలోకి మేకల మందతో వచ్చిన చుక్కల దుప్పిని సోమవారం అటవీ అధికారులు రక్షించారు. గ్రామస్తుల సమాచారంతో జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, ధనోరా సెక్షన్ అధికారి మల్లయ్య, బీట్ అధికారిణి స్వప్న అక్కడికి చేరుకొని దానిని తీసుకుని మండల పశుసంవర్ధక శాఖ అధికారితో పరీక్షలు చేయించి, అవసరమైన ఆహారం అందించి తిరిగి అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు హాని కలిగించకూడదని, ఎక్కడైనా వన్యప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో యానిమల్ ట్రాకర్ దేవరావు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



అక్రమంగా బొలెరోలో తరలిస్తున్న ఆరు పశువులను పట్టుకున్నట్టు ఎస్సై కొమురయ్య తెలిపారు. సమాచారం మేరకు మండలంలోని ఎల్కపల్లి నుంచి హైదారాబాద్‌కు తరలిస్తున్న 6 పశువలను ప్రభుత్వ పాఠశాల వద్ద సోమవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో పట్టుకున్నట్లు తెలిపారు. రాస్పెల్లి గ్రామానికి చెందిన బొలేరో డ్రైవర్ అంబిలపు శ్రీకాంత్, జాడీ రవీందర్, చిట్యాల సత్యనారాయణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పశువులను గోశాలకు తరలిస్తుట్టు విచారణలో తెలిసిందన్నారు.

బాల్ వివాహ్ ముక్త్ భారత్‌పై అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా ఆశ్రమ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బాలల హక్కుల రక్షణ, బాల్ వివాహ్ ముక్త్ భారత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే హక్కులు, రక్షణ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు విద్యార్థులదే ప్రముఖ పాత్ర అన్నారు. బాల్య వివాహం జరిగితే కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం చట్ట పరమైన చర్యలపై వివరించారు. తల్లిదండ్రులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహం జరిగినట్టు సమాచారం తెలిస్తే వెంటనే 1098 లేదా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ పీతాంబర్, సుకన్య, శకుంతల, సుగుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయోలజికల్ ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలోని పలు పాఠశాలల్లో సోమవారం బయోలజకల్ ఫోరం ఆధ్వర్యంలో జీవశాస్త్ర విభాగంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్‌పంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, పాఠశాల హెచ్‌ఎం వెంకటరాజయ్య విడుదల చేశారు. కార్యక్రమంలో బయో సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు బత్తుల శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి జాడి కేశవ్, ఫోరం సభ్యులు శ్రీనివాస్, రవి, రాకీ, స్వరూప పాల్గొన్నారు.

మండల స్థాయి విజేతలు

కాగా ఈ టాలెంట్ టెస్ట్‌ను జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించగా సాయంత్రం ఆయా మండలాలలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలను ప్రకటించారు. కాగజ్‌నగర్ మండలంలో కీర్తి సిరి, ప్రవిశ్మ దహెగాం మండలంలో మెస్రం అంజలి, జంగంపల్లి అంజలి, రెబ్బెన మండలంలో జి.విఘ్నేష్, ఎల్.సాయికిరణ, సిర్పూరు(టి) మండలంలో శ్రీచరణ్, ఇ.సాయికుమార్, కౌటాల మండలంలో కె సాయికృష్ణ, పి.అనిల్‌కుమార్, పెంచికల్‌పేట్‌లో డి జ్ఞానేశ్వర్, జి.పూజిత, ఆసిఫాబాద్‌లో ఎన్.మరియాదాస్, ఎస్ రాజు, ఆసిఫాబాద్ (రెసిడెన్సియల్)లో జి.వర్షిత, జి అంజలి, సిర్పూరు (టి) (రెసిడెన్సియల్)లో జి.శ్రీహిత, వై.అనూషలు విజేతలుగా నిలిచినట్లు బయో సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు బి.శాంతికుమార్ తెలిపారు.

ఇంద్రవెల్లికి తరలిన ఆదివాసులు



నవతెలంగాణ-కెరమరి

ఇంద్రవెల్లిలో జరిగిన ఆదివాసీల పోరాట దినోత్సవానికి సోమవారం ఆదివాసీ నాయకులు తరలివెళ్లారు. మండలంలోని సాకడ, సాంగ్వి, చౌపన్‌గూడ, జోడేఘాట్, మెట్ట పిప్రితో పాటు పలు గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజన నాయకులు ప్రత్యేక వాహనాలతో బయలుదేరారు. తుడుం దెబ్బ కమిటీ ఆధ్వర్యంలో గిరిజలనుల సమస్యలు పరిష్కారం కోసం వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో డిసెంబర్ 9ని పోరాట దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. గతంలో మొదట హైదరాబాద్‌లో ఆ తర్వాత ఢిల్లీలో నిర్వహించగా ఈ సారి ఇంద్రవెల్లిలో జరుపుకున్నట్లు తెలిపారు. ఇంద్రవెల్లి తరలి వెళ్లిన వారిలో పెందోర్ రాజేశ్వర్, కనక ప్రభాకర్, సెడ్మకి తుకారాం, సిడాం ధర్ము, కుమురం భీంరావు, దుందేరావు, రఘునాథ్, రాము పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వాహనదారులు వాహన ధ్రువపత్రాలు తమ వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై కొమురయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.



బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గంజాయి, గుట్కాతో పాటు బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. అదనపు ఎస్పీ ప్రభాకర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని జిల్లాలో కొంతమంది దళారీలు మాదకద్రవ్యాలను పెంపొందించడంతో పాటు బెల్టు దుకాణాలను విచ్చలవిడిగా ప్రారంభిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువత వీటికి బానిస కావడం బాధాకరంగా ఉందన్నారు. బెల్ట్ దుకాణాలు పెరగడంతో మద్యం మత్తులో వాహనాలు నడిపి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అంతర్గతంగా వ్యభిచార గృహాలు కూడా పెరిగిపోయాయని తనిఖీలు నిర్వహించి సంఘవిద్రోహ కార్యకలాపాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గేడం టీకానంద్, జిల్లా నాయకులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్ గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జిల్లాలో అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌నుకలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షంతో పత్తి, వరి పంట రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిన పత్తి, వరి ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షంతో వరి ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో షరతులు విధించకుండా ప్రతి గింజ కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

నేటి నుండి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యా శాఖలో అంతర్భాగంగా ఉన్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేటి నుండి సేవలు నిలిపివేయడానికి నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని కేజీబీవీలు అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బంది సమ్మె నోటీసును జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ గమినియల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్‌లో అంతర్భాగమైన తాము కూడా సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. నేటి నుండి తమ సర్వీస్ రెగ్యులర్ అయ్యేవరకు పాఠశాలలో విద్యాబోధన నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. కేవలం విద్యార్థులకు భోజన వసతి మాత్రమే నిరంతరాయంగా కొనసాగేలా చూస్తామని తెలిపారు. మొదట సోమవారం నుండి సమ్మె చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ సోనియా గాంధీ జన్మదినోత్సవం పురస్కరించుకొని ఆమె మీద గౌరవంతో సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఆవేదన విని సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెతో 15 కేజీబీవీలలో ఒక యుఆర్‌ఎస్ పాఠశాలలో విద్య బోధన నిలిచిపోనుంది. కార్యక్రమంలో సిర్పూర్(టి), ఆసిఫాబాద్, బెజ్జూర్, కౌటాల, రెబ్బెన, పెంచికల్‌పేట్, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), చింతలమానేపల్లి, లింగాపూర్, తిర్యాణి, కాగజ్‌నగర్, దహెగాం మండలాల ఎస్‌ఓలు ఇంద్రాణి, నాగసుధ, నలంద, అరుణ, పవిత్ర, పద్మ, కవిత, మీనా, ప్రవీణ, సుమలత, స్వప్న, నందిని, స్వప్న, రమాదేవి, రిజ్వాన, యుఆర్‌ఎస్ ఎస్‌ఓ ముంజం ధర్మయ్య పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

- ఎంపీడీఓ అంజత్ పాషా



నవతెలంగాణ-కెరమెరి

సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలికలకు మోడీ ఆశ్రమ బాలికల పాఠశాల, బాలురకు హట్టి ఆశ్రమ పాఠశాలలో క్రీడలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మండల స్థాయిలో 10, 12 తేదీలు, జిల్లా స్థాయిలో 16 నుంచి 21 వరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల నిర్వాహణకు అన్ని స్థాయిల్లో కమీటీలను ఏర్పాటు చేశామని, క్రీడాకారులు పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మెడల్స్‌తో మంచి పేరు ప్రాఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, విద్యాధికారి ఆడే ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ భీంరావు, పీఈటీ నాగోరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెలంగాణ ఇచ్చిన గొప్ప తల్లి సోనియమ్మ అని కొనియాడారు. ఆమె ఆలోచన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళకు సాకారం అయిందని అన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ఆమెకు రుణపడి ఉండాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు మాసాదే చరణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గుండా శ్యామ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ, మాజీ ఎంపీపీ బొమ్మెన బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేని మల్లేష్, ఎన్‌ఎస్‌ఐ అసెంబ్లీ ప్రెసిడెంట్ జమీర్ అహ్మద్, ఆసిఫాబాద్ టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ రఫీక్, షేక్ అసద్, కళావతి, గంగారం, బాలు, దీపక్, డాక్టర్ రమేష్, మారుతి, బబ్లు పాల్గొన్నారు.



వాంకిడి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను మండల అధ్యక్షుడు గురునులె నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో మహిళలు, రైతులు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మండోకర్ అనిల్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ మండోకర్ దాదాజీ, సవాతి గ్రామ మాజీ ఎంపీటీసీ కొడప మారుతి, కాంగ్రెస్ మండల సెక్రటరీ సెండె హనుమంతు, సీనియర్ నాయకుడు జమల్‌పూరి సుధాకర్, వడై పాండు, బొట్టుపల్లి జయరాం, ప్రచార కార్యదర్శి రమేష్, ప్రకాష్, ఎల్లయ్య, మొండి, పురుషోత్తం, వసంత్‌రావు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూపీఏ చైర్పర్సన్ సోనియా గాంధీ తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాల వేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొడప విశ్వేశ్వర్, కాంగ్రెస్ నాయకులు సామల రాజన్న, రంగు సురేష్ గౌడ్, దూగుంట శైలష్ చారి, గుమ్ముల శ్రీనివాస్, ఔత్కార్ లక్ష్మణ్, కొట్రంగి శంకర్, వసాకే విజయ్, కుమ్మరి పోశం, గాండ్ల పోశం, మహిళలు రైతులు పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందె వెంకటేష్ ఆధ్వర్యంలో అఖిలభారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్భహించారు. ఆమె చిత్రపటం ముందు కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత సోనియా గాంధికే దక్కిందన్నారు. స్థానిక సంస్థల్లో కూడా ఇదే ఉపుతో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెమ్మకరి తోగేష్, నాయకులు కంభగొని సంతోష్ గౌడ్, నాగేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.





శైలజ కుటుంబానికి ఆర్థిసాయం అందించాలి : మాలీ సంఘం



నవతెలంగాణ-వాంకిడి

ఫుడ్ పాయిజన్ ఘటనలో మతి చెందిన శైలజ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని మాలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు గురునులే మెంగాజీ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎటువంటి సహకారం అందలేదని, ఈ నెల ఏడో తేదీన రాష్ట్ర విద్యా కమీషన్ సభ్యుడు వెంకటేశ్వర్ ఆశ్రమ పాఠశాలను సందర్శించి భోజనం వికటించలేదని, ఆర్‌ఎంపీ వైద్యుల నిర్లక్ష్యం వల్లనే శైలజ మృతి చెందిందనడం సరైనది కాదని, దీనిని మాలీ సంక్షేమ సంఘం ఖండిస్తుందన్నారు. శైలజ మరణానికి ప్రభుత్వానికి అనుమానాలుంటే ప్రత్యేక కమిటీ వేసి మతికి గల కారాణాలు తెలుసుకోవాలన్నారు. అంతేకాని ఇలాంటి చేతకానితనానికి ఆరోపణలకు దిగడం నిదర్శనం అన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన ఉన్నతాధికారి పర్యవేక్షణ లోపం వల్లనే జరిగిందని భావిస్తూ దీనికి సంబంధించిన డీటీడీఏను వెంటనే సస్పెండ్ చేస్తూ విద్యార్థి కుటుంబానికి సరైన న్యాయం చేయాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా, ప్రభుత్వ ఉద్యోగం, 5 ఎకరాల పట్టాభూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు గురునులే మెంగాజీ, మండల అధ్యక్షుడు వాడై బాబురావు, డాబా గ్రామ పటేల్ మొహర్లే మహేందర్, మండల ప్రచార కార్యదర్శి సెండే సుధాకర్, మండల కోశాధికారి బెండారే కష్ణ, సంఘం నాయకులు నాగేష్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాదిగల మహాగర్జన కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న హైదరాబాద్‌లో తెలంగాణ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల మహా గర్జన కరపత్రాలను ఆ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా విభజన కోసం పోరాటం జరుగుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరేత్తనట్లు వ్యవహరిస్తున్నాయని, ఇప్పటికైనా విభజనపై ముందడుగు వేయాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా ఈనెల 19న హైదరాబాద్‌లో చేపట్టే మహాగర్జనకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. అంతకు ముందు జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో గ్రామం మండల స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొమ్మన ధర్మయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మూతి లక్ష్మణ్, మోతే మురళి, సరస్వతీ, హరీష్, వంశీ, వడ్లూరి సుభాష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి

నవతెలంగాణ-వాంకిడి

ఎస్సీ వర్గీకరణతో జిల్లాలోని బౌద్ధులకు తీవ్ర నష్టం కలుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు మద్ధతుగా చేపట్టిన ప్రక్రియను నిలిపివేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో బౌద్ధ సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలని, స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మహర్లు అభివృద్ధి చేందలేదని, జనాభా మాత్రం అప్పటికన్న ఇప్పుడు నాలుగింతలు పెరిగిందని, దీంతో రిజర్వేషన్ ఫలాలు అందకుండా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి మహర్లకు ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో అధిక వాటా కేటాయించాలని, రిజర్వేషన్ వర్గీకరణ ప్రక్రియను మానుకోవాలని తీర్మాణంలో పేర్కొన్నామన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ఆర్గనైజర్ ఉప్రె విజయ్, మండలాధ్యక్షుడు జైరాం, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యాక్షులు దుర్గం హంసరాజ్, బౌద్ధ జమాజ్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, విలాస్, నాయకులు రాజేశ్వర్, యు.రోషన్, అరుణ్, ప్రతాప్, జే.రోషన్, దుర్గం దీపక్ డిలాజీ, దుర్గం మనోజ్, దుర్గం ప్రల్హాద్, ఆర్ శ్రీధర్, యు.వివేక్, చంద్రమని, జాడే నగేష్ పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో విద్య

నవతెలంగాణ-రెబ్బెన

అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్యను పిల్లలకు అందించడం జరుగుతుందని ఆసిఫాబాద్ సీడీపీఓ సాదియా రుక్సానా అన్నారు. సోమవారం మండలంలోని గోలేటిలో ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన బాలమేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడం ద్వారా మానసిక పరిపక్వత చెంది భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతిరోజు పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం ద్వారా పిల్లలు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. అలాగే గర్భిణులు బాలింతలకు ఒక్క పూట సంపూర్ణ భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల నుండి వచ్చిన పిల్లలు తాము ఆయా కేంద్రాలలో నేర్చుకున్న ఆటపాటలను మంచి అలవాటును ప్రదర్శించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమలత, సూపర్‌వైజర్లు తిరుపతమ్మ, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, సంధ్యారాణి, మంజుల, సుశీల, మల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, బాలమ్మ, సాంబలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ సేవలు 4రోజులు నిలిపివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ నెల చివరి నాలుగు రోజులు ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిచిపోనున్నట్టు బ్యాంకు మేనేజర్ విశ్వనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలు డీజీబీలో విలీనం చేయడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఉండే పని వలన ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, ఆఫ్‌లైన్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని బాదంపల్లి, పుట్టిగూడ గ్రామ ప్రజలకు అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించడం జరిగిందని జన్నారం ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల మనుగడకు ప్రమాదకరంగా ఉండే విద్యుత్ తీగలను అమర్చవద్దని సూచించారు. అడవులు, వన్య ప్రాణుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, దానికి అందరూ సహకరించాలని కోరారు. అడవులను సంరక్షించుకోవాలని సూచించారు. అడవులుంటేనే వాతావరణ సమతుల్యంగా ఉండి సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

చేసిన పనులకు డబ్బులు అడిగితే అరెస్టులా..?

నవతెలంగాణ-జన్నారం



ఐదు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలను అద్దంలా తీర్చిదిద్ది, ఎన్నో వ్యయ ప్రయాసల ఓర్చుకొని అప్పులు తెచ్చి అభివృద్ధి చేస్తే సర్పంచుల డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కబెడుతుందని మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ సర్పంచ్లను ఎస్సై రాజ వర్ధన్ సోమవారం తెల్లవారుజామునే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఫోరం మాజీ అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామపంచాయతీలో దాదాపు రూ.కోటి ఎన్నైల లక్షల, 40వేలు రావాల్సి ఉందన్నారు. బిల్లులు రాక చాలామంది అప్పులు తెచ్చి వడ్డీ కట్టలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

తైక్వాండోలో విద్యా భారతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-తాండూర్

ఈనెల 8న లక్షెట్టిపేటలో జరిగిన 4వ స్టేట్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే కుంగ్ ఫు ఛాంపియన్‌షిప్ పోటీలో విద్యా భారతి హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 9 సంవత్సరాల కటాస్ విభాగంలో కోట లక్ష్మీ నిహారిక గోల్డ్,10 సంవత్సరాల కటాస్ విభాగంలో పులగం నందిత,13 సంవత్సరాల కటాస్ విభాగంలో కామని నక్షత్ర, దీపిక గోల్డ్ మెడల్ సాధించారు. 11 సంవత్సరాల స్పారింగ్ విభాగంలో రాజ్ పురోహిత్ రూపసా సింగ్ బ్రాంజ్ మెడల్, 12 సంవత్సరాల స్పారింగ్ విభాగంలో సార మోక్షిత్ గోల్డ్ మెడల్, కస్తూరి శివ చరణ్ బ్రాంజ్ మెడల్, 13 సంవత్సరాల స్పారింగ్ విభాగంలో గంధర్వ విక్రమ్ తేజ్ గోల్డ్ మెడల్ సాధించారు. కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, ప్రిన్సిపాల్ సరోజిని, పీఈటీలు, ఉపాధ్యాయులు, ప్రెసిడెంట్ చిరంజీవి, కరాటే మాస్టర్ రాజేష్, ఇన్‌స్ట్రక్టర్ ఇప్ప శ్రావణి విద్యార్థులను అభినందించారు.

డిపార్మెంటల్ అధికారులతో జీఎం సమీక్షా సమావేశం



నవతెలంగాణ-మందమర్రి

ఈ నెల 10వ తేది నుండి 17 వరకు మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాలున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో ఏరియా జీఎం దేవేందర్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023-24 సంవత్సరంలో కంపెనీ సాధించిన అంశాలు, 2024-25 సంవత్సరం లక్ష్యాలు, సెప్టెంబర్ వరకు సాధించిన వివరాలు, భూగర్భ గనుల యంత్రాల వినియోగం, ఉద్యోగుల హాజరు శాతం, సంక్షేమ కార్యక్రమాలు, కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు ముందున్న సవాళ్లు, లక్ష్యాలను సాధించడానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం విజయ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, ఏరియా ఇంజనీర్ ఈఈఎం వెంకటరమణ, కేకే గ్రూప్ ఏజెంట్ రాంచందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీజీఎం ఎఫ్అండ్ఏ వీఎస్ఆర్ కే.ప్రసాద్, గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఆవులకు పరీక్షలు చేయించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లోని రైతులు తమ ఆవులు, కోడెలకు సూడు పరీక్షలు చేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి డా.కస్తూరి శ్రీకాంత్ సూచించారు. సోమవారం మండలంలోని రోటిగూడ గ్రామపంచాయతీలో పశు గణాభి సంస్థ ఆదిలాబాద్, పశు సంవర్ధక శాఖ మండిలాల ఆధ్వర్యంలో ఉచిత గర్భ కోశ వ్యాధి నివారణ, చికిత్సలు, సూడు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరంలో దాదాపు 50 పశువులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. అలాగే పాడి రైతులకు పలు సూచనలు సలహాలు అందించామన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది సంజీవ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రవి, రోటిగూడ కేంద్రం గోపాలమిత్ర సిలివేరి రమేష్, రాజన్న పాల్గొన్నారు.

ప్రజా పాలన ముగింపు కార్యక్రమం

నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 1 నుండి 9 వరకు సాగిన ప్రజా పాలన విజయోత్సవ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం బెల్లంపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ సానిటరీ వర్కర్లు, డ్రైవర్లు, ఆర్పీలకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. సానిటేషన్ వర్కర్లు, డ్రైవర్లను సత్కరించి ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, కౌన్సిల్, కో ఆప్షన్ సభ్యులు, డాక్టర్లు, హెల్త్, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.



పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్



నవతెలంగాణ-జన్నారం

అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఆవరణ, రాంపూర్ గ్రామంలో అకాల వర్షంతో నష్టపోయిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షంతో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులకు నష్టం వచ్చిందన్నారు. ప్రభుత్వం రైతు కొనుగోళ్లను ఆలస్యం చేయడం వల్లనే రైతులకు ఈ గోసదాపురించిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రోడ్లపై నేల పాలు కావడం దురదృష్టకరమన్నారు. పంటలు సక్రమంగా పండక రైతులకు బంధు లేక ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతుంటే ఇలా అకాల వర్షాలతో రైతులు పంటను నష్టపోవడం కలచివేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తడిసిన వరి ధాన్యంతో సహా ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అకాల వర్షంతో అన్ని విధాల నష్టపోయామని, మాకు కడుపు కోత మిగిలిందని రైతులు జాన్సన్ నాయక్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయిందని లింగాయపల్లి గ్రామానికి చెందిన గోగు రాజం(రాజేష్) వాపోయారు. పొలంలో పండించిన రెండు ట్రాక్టర్ల ధాన్యం పూర్తిగా కొట్టుకుపోవడంతో విలపించాడు. ఆయన ఏడుపుతో అక్కడున్న వారి కళ్లలో నీళ్లు తిరిగాయి. మండలంలోని పలువురు రైతుల ధాన్యం వర్షానికి నానిపోయింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, జన్నారం, మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ సులారి వినయ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు ముస్సార్ అలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, మండల ఉపాధ్యక్షులు జంగం ఇంజనీర్, యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్, కే ఏ నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జీఎం సూర్యనారాయణ

నవతెలంగాణ-నస్పూర్



ఉద్యోగుల రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ.సూర్యనారాయణ అన్నారు. సోమవారం 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో వార్షిక రక్షణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని రక్షణ వారోత్సవాల ఇన్‌స్పెక్షన్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ జనరల్ మేనేజర్ ఈఅండ్ఎం ఎలిషాతో కలిసి జీఎం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షిక రక్షణ పక్షోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రక్షణ వారోత్సవాలలో అందరితో పాటుగా పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. అలాగే ఉద్యోగులు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్స్‌పై అవగాహన కలిగి ఉంటూ, వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ తమతో పాటు ఇతరుల రక్షణను కూడా ఎల్లవేళలా చూస్తూ ఉండాలన్నారు. సింగరేణి సంస్థలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్స్‌తో ముందుకు వెళ్తామంటామని, ప్రతి ఒక్క ఉద్యోగి సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్స్ తెలుసుకొని ముందుకు వెళ్లాలని, సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తుందని, ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే క్రమంలో రక్షణ ఎవరూ మరువకూడదని సూచించారు. అనంతరం అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పని విధానాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, వారు తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను గమనించడం జరుగుతుందని, ప్రతిరోజు రక్షణతో పని చేయాలని సంస్థ పురోగతిలో భాగస్వాములు కావాలని ఎలిషా తెలిపారు. ఇంత ముందు జరిగిన ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న రక్షణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి : పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఇతర శాఖలకు సంబంధించిన పనులు, సర్వేలు వంటి అదనపు విధులు నిర్వహించాల్సి వచ్చినప్పుడు అవసరమైన పనులకు మినహాయింపు కల్పించాల్సిన అవసరమని మండల పరిధి గ్రామపంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఎంపీడీఓ సత్యనారాయణను కలిసి సమస్యల పరిష్కారంతో పాటు హక్కుల సాధన కోసం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ పరిధిలో కార్యదర్శులు ముఖ్యంగా కావల్సివస్తున్న తీరును గుర్తు చేస్తూ అదనపు పని భారం మోయాల్సివస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినంతరం ప్రజా పాలన ద్వారా గ్రామీణుల నుండి అర్జీలు స్వీకరించడం, వాటిని ఆన్‌లైన్ చేయించడం, వేసవి కాలంలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, మిషన్ భగీరథ, ఇంటింటి నల్ల సర్వే చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆదేవిధంగా ఎలక్షన్ సర్వే, ఇటీవల నిర్వహించిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కులగణన సర్వేలో కీలకమైన పాత్ర పోషించడంతో పాటు ఎన్యూమరేషన్ విధులు, డేటా ఎంట్రీ వంటివి పూర్తి చేయడంలో శాయి శక్తుల పాత్ర పోషించామన్నారు. 10 నెలలుగా గ్రామాలలో పాలకవర్గం, నిధులు లేకపోయినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్థిక భారం పడుతున్నా ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తున్నామన్నారు.

భీమారంలో...

గ్రామ పంచాయతీ కార్యదర్శుల జాబ్ చార్ట్ ప్రకారం నిర్వహించవల్సిన ప్రాథమిక విధులు కాకుండా ఇతర శాఖల పనులు, సర్వేలు అప్పగించినప్పుడు పనిభారం నుండి ఉపశమనం కల్పించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భీమారం గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తితో కలిసి ఎంపీడీఓ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు.

జన్నారం : తమపై పని ఒత్తిడిని తగ్గించాలని మండలంలోని 29 గ్రామపంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం ఎంపీడీఓ శశికళకు వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి ఎక్కువగా ఉందని దాన్ని తగ్గించాలన్నారు. సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు ఆకాపర్తి శ్రీనివాస్, కార్యదర్శి మధు, క్యాషియర్ విశ్వ సరిత, శ్రీకాంత్, మహేందర్, మధుకర్, లావణ్య, ఎంపీఈఓ జలందర్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జన్నారం



తాండూర్

రాజ్యసభ సభ్యురాలు, ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహా నాయకురాలు సోనియమ్మ అని అన్నారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, రాజశేఖర్, మత్యు శంకర్రావు, ఇసాక్, ముత్యం సతీష్, సుభాష్ నాయక్, లక్ష్మీనారాయణ, నందునాయక్, మహమ్మద్ అజారుద్దీన్, కుమారస్వామి, ముత్యం రాజన్న, షాకీర్, కంబెం శంకర్, నంద నాయక్, మౌలానా, ప్రదీప్ పాల్గొన్నారు.

తాండూర్ : కాంగ్రెస్ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పట్లె విశ్వకళ్యాణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ ప్రధాన పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మంతెన శివకృష్ణ, నాయకులు మాసాడి తిరుపతి, శంకర్, సత్యం, ముస్కు సాగర్, నల్లుల మహేష్, ముదం రము, సింగరాజ్, రమ్య, శ్రీధర్, గౌస్, కోర్కా శంకర్, రాజేశం, రవి నాయకులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని విశ్రాంతి భవనంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచుతూ పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం మాట్లాడుతూ దశాబ్దాల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన తెలంగాణ తల్లి శ్రీ సోనియా గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పింగళి రమేష్, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట

జన జీవన స్రవంతిలో కలవాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచన



నవతెలంగాణ-మందమర్రి

అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మావోయిస్టులకు సూచించారు. సోమవారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మందమర్రి గ్రామ నివాసులైన మావోయిస్టు పార్టీ సభ్యుడు జక్కిరెడ్ది రవి ఇంటికెళ్లి వారి తల్లి లక్ష్మిని కలిశారు. ఆమె ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. 24 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్న కుమారుడు రవిని లొంగిపోయేలా నచ్చజెప్పాలని సూచించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం, దుప్పట్లు అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ సాధ్యం కాని సిద్ధాంతాలు, ఆశయాలతో అడవిలో ఉంటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారే తప్ప సాధించేది ఏమీ లేదన్నారు. జన జీవన స్రవంతిలో కలిస్తే పునరావాసం కల్పిస్తామని, అనారోగ్యంతో ఉన్నవారికి మెరుగైన చికిత్సనందిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులున్నా చట్టపరిధిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఎందరో ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు శోకం మిగిల్చారన్నారు. వారు అక్కడ అడవిలో ఉండి ఇక్కడ కుటుంబ సభ్యుల పరిస్థితులను ఏమాత్రం ఆలోచించుకోవడం లేదని, ఫలితంగా కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ కె.శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

- భీమారం ఎంపీడీఓ మధుసూధన్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులు నిరంతరాయంగా కొనసాగాలని ఎంపీడీఓ మధుసూదన్ అన్నారు. ఎంపీఓ సతీష్ రెడ్డితో కలిసి సోమవారం మండల పరిధిలో కొనసాగుతున్న పనుల నిర్వాహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ ద్వారా నిర్మించాల్సిన ఆవులు, గొర్రెల షెడ్ల నిర్మాణాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను గుర్తించి పనులపై దృష్టి సారించాలన్నారు. ఈజీఎస్ ద్వారా చేపడుతున్న నర్సరీల నిర్వాహణ కొనసాగింపు తీరును అడిగి తెలుసుకున్నారు. కాగా గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులతో పాటు గ్రామాల వారిగా ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం పూర్తి వరకు వంద శాతం ఇంటి పన్ను వసూళ్లకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ ఏపీఓ జీనత్, గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఆడిట్‌లోని సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఇంటర్నల్ ఆడిట్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా అన్నారు. సోమవారం బెల్లంపల్లి రీజియన్ ఇంటర్నల్ ఆడిట్ ఫీల్డ్ కమిటీ నాయకులకు ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మికి పరిచయం చేసి, అనంతరం ఇంటర్నల్ ఆడిట్‌లోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్నల్ ఆడిట్‌లో పని చేస్తున్న మహిళలకు రెస్ట్ రూమ్స్, టాయిలెట్, మంచినీటి సౌకర్యం కల్పించాలని, కార్పొరేట్ సర్కులర్ ప్రకారం భోజన విరామం ఇవ్వాలన్నారు. డ్యూటీ సమయం కంటే ఎక్కువ పని చేసిన ఉద్యోగులకు ఓటీ చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ఫైనాన్స్ ఇన్‌ఛార్జి నాగలక్ష్మితో చర్చించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, ఇంటర్నల్ ఆడిట్ ఫిట్ కార్యదర్శి జి.రాజు, సహాయ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు మల్లేష్, హరి, రమేష్, సైని పాల్గొన్నారు.

కౌలు రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపల్లి గ్రామంలో కౌలు రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని జన్నారం క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య తెలిపారు. సోమవారం బాదంపల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. ఆమె పలువురు కౌలు రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రతి కౌలు రైతు వివరాలను నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
5
మంగళవారం | డిసెంబర్ 10, 2024 | www.navatelangana.com

ఓపెన్ హౌస్ కార్యక్రమం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులకు ఉదయం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులకు జిల్లాలో వినియోగిస్తున్న ఆయుధాలు, బాంబు డిస్పోజల్ సామాగ్రి వాటి వినియోగం గురించి వివరించారు. పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు, అత్యవసర సమయాలలో విద్యార్థులు వినియోగించాల్సిన డయల్-100 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ వేయించిన మార్కెట్ కమిటీ చైర్మెన్

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం సోనియాగాంధీ పుట్టిన రోజు పురస్కరించుకొని మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హది తన సొంత ఖర్చుతో బోర్ వెల్ వేయించి విద్యార్థులకు నీటి సౌకర్యం కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చైర్మెన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కిషన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కొత్తకాపు పోతారెడ్డి, నాయకులు సాకిపెల్లి సురేందర్, బట్టు భోజన్న, రాజ్ కుమార్, మోబిన్, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గాదిగూడ మండలం శివనారా గ్రామానికి చెందిన రాజు తమ గ్రామానికి అంగన్‌వాడీ సెంటర్, సీసీ రోడ్డు మంజూరు చేయాలని, సిర్పూర్ (యు) మండలం మెట్టిగూడ గ్రామానికి చెందిన పెందోర్ భువనేశ్వరి తనకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. భీమిని మండలం కర్జి భీంపూర్ గ్రామానికి చెందిన టెకం పోషన్న తనకు బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు, ఏపీఓ పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ అధికారి ఉమాదేవి, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు సాగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాస్త్ర, సాంకేతిక రంగాలపై బాల్య దశ నుంచే అవగాహనను పెంపొందించుకుంటూ నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు సాగాలని డీఈఓ ప్రణీత విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని లిటిల్‌స్టార్ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ లెవల్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. చిన్నారులు తమ ప్రతిభా పాటవాలతో ఆలోచింపజేసేలా రూపొందించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. వర్షం నీటి సంరక్షణ, ట్రాఫిక్, పచ్చదనం, పరిశుభ్రత, నీటి శుద్ధి, సేంద్రీయ ఎరువుల తయారీ, చెత్త నుంచి విద్యుశ్శక్తి తయారీ తదితర అంశాలను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. నేటి మన సౌకర్యాలన్ని నాటి శాస్త్రవేత్తల ఆలోచనల నుంచి మొగ్గ తొడిగినవేనని, వినూత్న ఆలోచనలతో భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. మన నిత్య జీవితంలో సైన్స్ పాత్ర ఎనలేనిదని, ప్రతి అంశం ఆవిష్కరణతో ముడిపడి ఉన్నదేనని పేర్కొన్నారు. తరగతి గదికే పరిమితం కారాదని, ప్రయోగాల ద్వారా జరిగే బోధన మరింత ప్రభావవంతంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, ఆరె భాస్కర్, డీఈఓ సీసీ రాజేశ్వర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్, పాఠశాల ప్రిన్సిపల్ కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరించిన

పలు హోటల్ యజమానులకు జైలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచిన పలు దాబా హోటళ్లపై కేసు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. రాత్రి సమయంలో పరిమితి సమయానికి మించి తెరిచి ఉంచిన బైపాస్ సమీపంలోని జై కిసాన్ దాబా, చాందిని దాబా, సాతుప్ల్ వద్ద గల స్ప్రింగ్ బేకరి, హోటల్, అన్సార్ హోటల్ యజమానులకు సెకండ్ క్లాస్ న్యాయమూర్తి 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. ప్రతి హోటల్, దుకాణాల వ్యాపారులు నిబంధనల మేరకు రాత్రి 10.30 వరకు మూసి వేయాలని సీఐ సూచించారు.

రూ.3.5 కోట్ల విలువ చేసే ఎండు గంజాయి ధ్వంసం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రూ.3.5 కోట్ల విలువ చేసే ఎండు గంజాయిని ధ్వంసం చేసినట్లు నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయ అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదేశాల మేరకు సోమవారం రూ.3.5 కోట్ల విలువైన.. 1007.02 కేజీల ఎండు గంజాయి, 35 కేజీల గంజాయి చాక్లెట్లు, 7 కేజీల దయాజెపామ్, 8 కేజీల అల్ప్రాజోలం, 2 గంజాయి మొక్కలను జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లోని ఎంఎస్ మెడికేర్ సర్వీసెస్‌లో ధ్వంసం చేసినట్టు తెలిపారు. నిజామాబాద్, బోదన్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓలు సిబ్బంది ధ్వంసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి

నవతెలంగాణ-కామారెడ్డి

తమ భూములను రెడ్డి సామాజికవర్గానికి చెందిన పలువురు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, తమ భూములను అధికారులు, ఎమ్మెల్యేలు తమకు ఇప్పించాలని రాజంపేట మండలం బసనపల్లి గ్రామానికి చెందిన దళితుల ప్రభుత్వాధికారులను కోరుతున్నారు. సోమవారం పహాణి కాపీల ప్రదర్శనతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బసన్నపల్లి గ్రామానికి చెందిన దళితులు మాట్లాడుతూ తమ భూమిని అదే గ్రామానికి చెందిన పలువురు రాజంపేట గ్రామ శివారులో గలస సర్వేనెంబర్ 577లో 11 ఎకరాల 4 గుంటల భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆరోపించారు. 1978-1979 సంవత్సరాల నుండి మా తాత ముత్తాతల పేర్ల పైన ఉండేదని 2014-2015 సంవత్సరంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆరోపించారు. అధికారులు, ఎమ్మెల్యేలు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వినతులిచ్చి.. పరిష్కరించాలని కోరి..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో ప్రజలు అందించే అర్జీల్లో సహేతుకమైన వాటి పరిష్కారంలో జాప్యం జరగకుండా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు చెప్పే సమస్యలను విన్న ఆమె వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భూవివాదాలు, ఉద్యోగాల కల్పన కోసం ప్రజావాణిలో అర్జీలు పెట్టుకోవద్దన్నారు. సమస్య పరిష్కారం కోసం కొంతకాలం వేచి ఉండాలని, అదే సమస్యపై పదే పదే అర్జీలు ఇవ్వడం సరికాదన్నారు. పరిష్కార సాధ్యమయ్యే వాటిని పెండింగ్‌లో పెట్టడం సరికాదని, అలా చేయడం వల్ల ప్రజా విశ్వాసాన్ని కోల్పోవాల్సి వస్తుందని అధికారులకు సూచించారు. కాగా ప్రజావాణిలో సోమవారం మొత్తం 78 వరకు వివిధ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ అయ్యేలా చూడాలి



రూ.2 లక్షల్లోపే ఉన్న రుణమాఫీ కాలేదని ఉట్నూర్ మండలంలోని లక్షిట్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని హాలీగూడ గ్రామస్తులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏండ్లుగా పోడు భూములను సాగు చేస్తు జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వం మాకు పట్టాలను అందించడంతో బ్యాంకు రుణాలను తీసుకున్నామన్నారు. ప్రభుత్వం వాటిని మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించిందని పేర్కొన్నారు. తమ రుణాలన్ని రూ.2లక్షల్లోపే ఉన్నాయని కానీ తమలో ఏ ఒక్కరికి రుణమాఫీ జరుగలేదన్నారు. ప్రభుత్వమేమో వందశాతం రుణమాఫీ పూర్తి చేశామని చెబుతుందని కానీ మాఫీ అవ్వడం లేదన్నారు. స్పందించి ఆదివాసులమైన మాకు వ్యవసాయ రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని కోరారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలి



జైనథ్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు ఆర్డీఓ ఆఫీసులో డిప్యూటేషన్ ఇవ్వడంతో మండలవాసులు కార్యాలయంలో పనులు కాక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి అన్నారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సదరు ఉద్యోగి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ అందుబాటు లేక మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. తిరిగి మండల కార్యాలయానికి పంపించాలని అన్నారు.

పింఛన్ వచ్చేలా చూడాలి



తమ గత నాలుగు సంవత్సరాలుగా వితంతు పింఛన్ రావడం లేదని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. ఇచ్చోడ మండలం బొరిగామలో చాలామందికి పింఛన్ రావడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గత 4 సంవత్సరాలుగా పింఛన్ రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. వెంటనే తమకు పింఛన్ వచ్చేలా చూడాలని న్యాయం చేయాలని కోరారు.

స్కావెంజర్లకు వేతనాలివ్వాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు ఇవ్వాలని ప్రజావాణిలో విన్నవించారు. సుమారుగా జిల్లాలో 650 మంది పాఠశాలలో స్కావెంజర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, పాఠశాలలో పరిశుభ్రంగా ఉంచడానికి తమ పాత్ర కీలకమని పేర్కొన్నారు. అటెండర్లు చేసే పని కూడా తామే చేస్తున్నామనీ వాపోయారు. గత ఆగస్టు నుంచి నవంబర్ వరకు 5 నెలల వేతనం రావాల్సి ఉందనీ, ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే వేతనాలు విడుదల చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.



జీపీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కుభీర్



ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు పవార్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులపై పని భారం మోపుతుందని అన్నారు. సమాచార సేకరణలో భాగంగా ప్రజాపాలనా దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ సర్వేలు, డిజిటల్ కార్డులు, కులగణన, ఆర్థిక సర్వే అదే విధంగా ఇందిరమ్మ గృహ నిర్మాణా లబ్దిదారుల ఎంపిక మొదలైన పనులను పంచాయతీ కార్యదర్శులు చేపట్టడం, ఈ సర్వేలను క్షేత్ర స్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా నిలుస్తూ విజయవంతంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. కానీ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి విధి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఎదురుకొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ప్రకటన విడుదల చేసి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శులు తోట సంజు, కమల్ సింగ్, వినోద్ కుమార్, కిరణ్ కుమార్, కునాల్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

17న ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 17న తపస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చవాన్, గోపికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కొలువు దీరిన కొత్త ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ బిల్లుల సమస్యలన్ని పరిష్కారమవుతాయని ఆశించామన్నారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నందున తపస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ రూపొందించి, దశల వారిగా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, మండల స్థాయిలో తహసీల్దార్‌లకు వినతిపత్రం సమర్పణ, జిల్లా కేంద్రంలో కలెక్టరేట్లు వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 17న ఇందిరాపార్క్‌లో 5వేల మంది ఉపాధ్యాయులతో ధర్మాగ్రహ దీక్ష చేపడుతున్నామని, ఈ దీక్షకి జిల్లానుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్థిక కార్యదర్శి బచ్చు నారాయణ, నాయకులు మెస్రం రాజ్ కుమార్, బత్తుల గంగాధర్, చదల రాజేష్, గోమంత్ రెడ్డి, సురేష్, ఆకాష్, వీరయ్య, గంభీర్, రాజశేఖర్, ప్రకాష్ మహిళా ప్రతినిధులు కుర్సెంగా జీజబాయి, సంగీత పాల్గొన్నారు.

నేటి బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ గ్యారంటీల గారడి 6 అబద్ధాలు 66 మోసాలపై జిల్లా కేంద్రంలో నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. ఉదయం 11 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమై జిల్లాలోని ప్రధాన రహదారుల గుండా కొనసాగుతుందని దీనికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డీఎస్పీకి నాయకుల సన్మానం

డీఎస్పీ కరుణాకర్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ర్యాలీ గురించి వివరించడంతో పాటు నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై అంశాలను డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంగ పెంటయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్, బీజేపి సీనియర్ నాయకులు ప్రసాద్ గౌడ్, గటన్న పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

నవతెలంగాణ-బాల్కొండ

భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన ఆమె భర్తను అరెస్టు చేసినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వన్నెల్ (బి) గ్రామంలో ఆదివారం జరిగిన మహిళా దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మండల కేంద్రంలోని సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్మూర్ రూరల్ సీఐ కే శ్రీధర్ రెడ్డి, బాల్కొండ ఎస్ఐ బి నరేష్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా బెల్కొని గ్రామం నుంచి జంగ శివకల తన భర్త రాజుగంగారం తో కలిసి వచ్చి వన్నెల్ (బి) గ్రామంలో జీవనం కొనసాగిస్తున్నారు. భర్త రాజు గంగారం తాగుడుకు బానిసై గత ఆరు నెలలుగా భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడని, ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్య శివకల నిద్రిస్తున్న సమయంలో భర్త గొడ్డలితో కిరాతకంగా తలపైన నరకడంతో అక్కడికక్కడే శివకల మృతి చెందింది. భార్యను హత్య చేసిన అనంతరం భర్త రాజుగంగారం పరారయ్యాడు. సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు రాజుగంగారం ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్



పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం తనుష్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆత్రం తనుష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సరాల నుంచి గిరిజన విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వేలాది మంది గిరిజన విద్యార్థులు తమ ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇతర ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న కూడా అకాడమిక్ ఫీజులు ప్రభుత్వం నుంచి కాలేజీలకు అందకపోవడం వలన వారి సర్టిఫికెట్లు చేతికి రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక పోతున్నామని అన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మడావి నాగోరావు, కనక మల్కు, కోవ సునీల్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచుల అరెస్టు

నవతెలంగాణ-ఆర్మూర్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాజా మాజీ సర్పంచ్‌ల చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా మండలంలోని పలువురు మాజీలను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో అంకాపూర్ కిశోర్‌రెడ్డి, అలూర్ మోహన్ రెడ్డి, దేగం గంగారెడ్డి, గగుపల్లి ప్రదీప్, రాంపూర్ దయానంద్, మచ్చేర్ల గంజి నర్శయ్య, ఖానాపూర్ సింగిరెడ్డి మోహన్, మిర్ధపల్లి మధు వర్మ, ఇస్సపల్లి రాజు ఉన్నారు.